తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



# స్టేట్ రౌండప్
STATE ROUNDUP



# నియోజకవర్గం అభివృద్దే మన లక్ష్యం

## పార్టీ మారినా ఫరవాలేదన్న కార్యకర్తలు

కాంగ్రెస్‌లో చేరికపై అనుయాయులతో కడియం చర్చ

కావ్యను ఆశీర్వదించాలని కార్యకర్తలకు వినతి

పార్టీలో సమన్వయ లోపం ఉందన్న కావ్య

పార్టీ శ్రేణులు ఎవ్వరూ సహకరించలేదని ఆరోపణ

హైదరాబాద్,మార్చి30: భారాస నేతలు అయోమయంలో ఉన్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆ పార్టీని వీడేందుకు సిద్ధమైన ఆయన తదుపరి కార్యాచరణపై దృష్టి సారించారు. కాంగ్రెస్ ఆహ్వానం నేపథ్యంలో ఆ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు కుమార్తె కావ్యతో కలిసి మంత్రుల నివాస ప్రాంగణంలో తన అనుచరులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ నేతలు తనను పార్టీలోకి ఆహ్వానించారని, రెండ్రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తానని చెప్పినట్టు తెలిపారు. కడియం ఏ నిర్ణయం తీసుకున్నా మద్దతిస్తామని ఆయన అనుచరులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారాస బలహీనపడిందన్న కడియం.. పార్టీ నేతల నుంచి సహకారం లభించలేదని తెలిపారు. ఓడిపోయే పార్టీ నుంచి పోటీ వద్దని కావ్య అనుకున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేయమని పిలుపు వచ్చిందని, అందరి అభిప్రాయం మేరకు నిర్ణయం ఉంటుందన్నారు. ఆరూరి రమేష్ వద్దంటేనే కావ్యకు టికెట్ ఇచ్చారని చెప్పారు. తనను విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదన్న ఆయన.. కావ్యను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి కీలక ప్రకటన చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తలతో మిగతా 2లో..



# బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు

## కాంగ్రెస్ ఖాతాలో పడ్డ కామారెడ్డి మున్సిపాలిటీ

కామారెడ్డి,మార్చి30: తెలంగాణలో బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఓ వైపు సీనియర్లు పార్టీని వీడుతుంటే.. మరోవైపు స్థానిక సంస్థల్లో ఆ పార్టీ మరింత బలహీనపడుతుంది. తాజాగా కామారెడ్డి బీఆర్ఎస్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో ఆమె ఛైర్ పర్సన్ పదవి కోల్పోయారు. కామారెడ్డి కొత్త మున్సిపల్ ఛైర్ పర్సన్‌గా కాంగ్రెస్ కౌన్సిలర్ గడ్డం ఇందుప్రియ ఎన్నికయ్యారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ జాహ్నవిపై సొంత పార్టీ కౌన్సిలర్లే తిరుగుబాటు చేశారు. అవిశ్వాసానికి పరోక్షంగా 9 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సహకరించారు. మొత్తం 49 మంది కౌన్సిలర్లకు గానూ, కాంగ్రెస్‌కు 27, బిఆర్ఎస్‌కు 16, బీజేపీకి ఆరుగురు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం సమయంలో కోరం సరిపోక పోవడంతో కాంగ్రెస్ కు అనుకూలంగా 9మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరయ్యారు. బీఆర్ఎస్‌పై అసంతృప్తితో ఉన్న ఈ 9మంది మిగతా 2లో..




# దానం నాగేందర్‌పై వేటువేయండి

## ఇంకెన్ని రోజులు నాన్చుతారు

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్,మార్చి30: బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన దానం నాగేందర్‌పై అసెంబ్లీ స్పీకర్ అనర్హతా వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు. శనివారం నాడు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... మార్చ్ 18వ తేదీన సభాపతిని కలిసి దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ వేసినట్లు తెలిపారు. దానం నాగేందర్ మిగతా 2లో..



# రేవంత్‌పై వసూళ్ల ఆరోపణలు..

## బంజారాహిల్స్‌లో కెటిఆర్‌పై క్రిమినల్ కేసు

హైదరాబాద్,మార్చి30: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డి రూ. 2500 కోట్లు వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై హనుమకొండ పోలీసులకు కాంగ్రెస్ నేత బత్తిన శ్రీనివాస్ రావు ఫిర్యాదు చేశారు. అయితే హనుమకొండ పోలీసులు ఆ కేసును బంజారా హిల్స్ స్టేషన్‌కు అక్కడి పోలీసులు బదిలీ చేశారు. కేటీఆర్‌పై బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ 504,505(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన సికింద్రాబాద్ లోక్?సభ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా? బీజేపీ ప్రభుత్వమా? అని అర్థం కావడం లేదన్నారు. సామంత రాజులా రేవంత్ ఢిల్లీకి రూ.2500 కోట్లు కప్పం కట్టారని ఆరోపించారు.

# మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలపై కోమటిరెడ్డి ఆగ్రహం



## కాంగ్రెస్‌లో మంత్రి పదవి ఇవ్వనందుకే అంటూ కామెంట్స్

హైదరాబాద్,మార్చి30: లోక్‌సభ ఎన్నికల వేళ తెలంగాణలో నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. 8 మంది భాజపా ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని ఆ పార్టీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి ఆక్షేపించారు. అసలు మీ తమ్ముడు మీతో టచ్‌లో మిగతా 2లో..

# బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు

మొదటిపేజీ తరువాయి..

కౌన్సిలర్లు ప్రత్యేక క్యాంపు నుంచి నేరుగా సమావేశానికి హాజరయ్యారు. బలపరీక్షలో జాహ్నావిని ఓడించడానికి ముందుగానే స్కెచ్ వేయగా.. వీరికి బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్య నేత అండగా నిలిచినట్లు తెలుస్తోంది. అవిశ్వాసానికి అనుకూలంగా 27 మంది చేతులు ఎత్తడంతో తీర్మానం నెగ్గింది. దీంతో కొత్త ఛైర్మన్‌గా గడ్డం ఇందుప్రియను ఎన్నుకున్నారు. బీజేపీ కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాలేదు. ఇందుప్రియ కామారెడ్డి 8వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. ఆమె అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో కాంగ్రెస్ కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం బయట టపాసులు కాల్చి స్వీట్లు పంచుతూ తమ ఆనందాన్ని పంచుకున్నారు.

# దానం నాగేందర్‌పై వేటువేయండి

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్‌లోకి వెళ్లారని తాము ఫిర్యాదు చేసి12 రోజులైనా స్పీకర్ నుంచి స్పందన లేదన్నారు. అదనపు అఫిడవిట్ సమర్పించేందుకు సభాపతిని కలిసేందుకు వెళ్తే ఎవరూ లేరని చెప్పారు. కార్యదర్శిపై ఏం ఒత్తిళ్లు ఉన్నాయో... కానీ ఆయన కూడా అందుబాటులో లేరన్నారు. కాంగ్రెస్ లోక్ సభ అభ్యర్థిగా దానం నాగేందర్ పేరును అధికారికంగా ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. సభాపతి నిర్ణయం తీసుకొని దానం నాగేందర్‌పై అనర్హతా వేటు వేస్తే దేశం మొత్తం హర్షిస్తారని చెప్పారు. నాగేందర్‌పై చర్య తీసుకుంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వారవుతారని అన్నారు. సభాపతి వెంటనే స్పందించాలని.. చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. నలుగురు ఎమ్మెల్యేలం పోతే కనీసం తమ వినతిపత్రం తీసుకోరా? అని ప్రశ్నించారు. సభాపతి చర్య తీసుకోకపోతే న్యాయస్థానానికి వెళ్తామని హెచ్చరించారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్లడం ఆ నేతలకు అంత సిగ్గుచేటు ఇంకోటి ఉండదన్నారు. కడియం శ్రీహరి పార్టీ మారడం నమ్మించి గొంతు కోయడమేనని అన్నారు. ప్రజలు ఆయనను చీకొట్టే పరిస్థితికి వచ్చారని చెప్పారు. ఇకపోతే ఎవరూ కడియంలా మాత్రం పార్టీకి ద్రోహం చేయరన్నారు. ఆయన వరంగల్ వెళ్తే ప్రజలు తరిమి కొట్టే పరిస్థితి ఉందన్నారు. పార్టీ నుంచి వెళ్లే నేతలకు రాబోయే కాలంలో అనర్హత వేటు వేస్తామని చెప్పారు. రైతులు లబోదిబోమని ఏడ్చే పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు.

# నియోజకవర్గం అభివృద్దే మన లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..

కడియం శ్రీహరి శనివారం నాడు సమావేశం అయ్యారు. పార్టీ మారుదామా వద్దా అని కార్యకర్తలను కడియం అడిగారు. బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోలేమని కడియంకు కార్యకర్తలు చెప్పారు. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా మీ వెంటే ఉంటామని ఏక వాక్య తీర్మానాన్ని కడియం శ్రీహరి అనుచరులు చేశారు. అయితే కార్యకర్తల నిర్ణయాన్ని బట్టి తాను నడుస్తానని కడియం తెలిపారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతున్నానంటే బీఆర్ఎస్ పార్టీకి భయమెందుకని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు పసునూరి దయాకర్, ఆరూరి రమేష్ పార్టీ మారితే లేని అభ్యంతరం తన విషయంలో ఎందుకని నిలదీశారు. తన రాజకీయ జీవితంలో ఒక్క అవినీతి ఆరోపణ లేదని చెప్పారు. తనపై ఒక్క పెట్టి కేసు కూడా లేదన్నారు. తన కుమార్తె కడియం కావ్యకు ఎంపీ టిక్కెట్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. ఉద్యమ కారులకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. తనకు వచ్చిన అవకాశాన్ని నియోజకవర్గ అభివృద్ధి కోసం ఉపయోగిస్తానని తెలిపారు. జిల్లాల్లో పక్క నియోజకవర్గాల్లో అభివృద్ధి జరిగిందని.. ఒక్క స్టేషన్ ఘన్‌పూర్ మాత్రమే వెనుకపడిందని కడియం శ్రీహరి అన్నారు. అలాగే బీఆర్ఎస్‌పై కడియం కావ్య తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలు దందాలు ఎక్కువ చేస్తుంటారని ఆరోపించారు. పార్టీ మారక ముందే తమపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాము ప్రతిపక్షంలో ఉన్నట్లుండేదని చెప్పారు. ఇప్పుడు కూడా అధికారులు తమ మాట వినడం లేదని కావ్య తెలిపారు. ఎన్ని రోజులు ఈ పరిస్థితి అని కడియం శ్రీహరి ఆలోచించారని పేర్కొన్నారు. అందుకే కడియం శ్రీహరి సమక్షంలోనే బీఆర్ఎస్‌పై కావ్య విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన ఆహ్వానంపై సమాలోచనలు జరిపామని తెలిపారు. గత కొంతకాలంగా పార్టీలో నాయకుల మధ్య వచ్చిన విభేదాల కారణంగానే తాము పార్టీ వీడేందుకు సిద్ధమైనట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తే తనను గెలిపించే వాతావరణం ఇక్కడ లేదని అయినా పార్టీ టికెట్ ఇస్తే పోటీ చేసేందకు సిద్ధపడినట్లు పేర్కొన్నారు. తమకు ఎవరూ మద్దతు ఇచ్చే పరిస్థితులు లేని కారణంగానే పోటీ నుంచి తప్పుకున్నట్లు వివరించారు. ఈ విభేదాలు, నాయకుల మధ్య సమన్వయ లోపమే బీఆర్ఎస్ ప్రతిష్ఠను దిగజారుస్తోందని తెలిపారు. తమ నియోజకవర్గాన్నికి ఈ మధ్య కాలంలోనే మాజీ మంత్రి హరీష్ రావు వచ్చినటప్పుడు కూడా సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపించిందన్నారు.

## మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలపై
# కోమటిరెడ్డి ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి..

ఉన్నారో లేదో తెలుసుకోవాలని మంత్రిని ఉద్దేశించి ఆయనకే చెల్లింది. మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌లో చేరుతానని వ్యాఖ్యానించారు. వెంకట్‌రెడ్డి తో పాటు ఐదుగురు మంత్రులు భాజపా అధిష్ఠానంతో టచ్‌లో ఉన్నారని చెప్పారు. తమ ఎమ్మెల్యేల్లో ఒక్కరిని ముట్టుకున్నా.. 48 గంటల్లో ప్రభుత్వం కూలిపోతుందని వ్యాఖ్యానించారు. మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. 'మహేశ్వర్‌రెడ్డి నాపై చేసిన వ్యాఖ్యలు సత్యదూరం. తప్పుడు ఆరోపణలు చేయడం



అడిగారు. మాకే మెజార్టీ ఉంది.. అవసరం లేదని చెప్పా. పార్టీలో చేర్చుకోలేదని మనసులో పెట్టుకొని ఏదేదో మాట్లాడుతున్నారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, గడ్కరీ వద్దకు వెళ్లి ఏదో చెప్పానని అంటున్నారు. మహేశ్వర్‌రెడ్డికి నేను సవాల్ చేస్తున్నా. వారిద్దరిని తీసుకొనిరా.. భాగ్యలక్ష్మి ఆలయం వద్ద ప్రమాణం చేద్దాం' అని ఛాలెంజ్ చేశారు.

# పాలనపై సోయిలేని సిఎం రేవంత్

## పంటలు ఎండిపోయి రైతులు ఏడుస్తున్నా పట్టింపేది
## కేసీఆర్ సిఎంగా ఉంటే.. ఈ కష్టం వచ్చేదా?
## మీడియా సమావేశంలో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శలు

**నల్లగొండ,మార్చి30:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలనపై సోయి లేదని మాజీ మంత్రి, సూర్యాపేట బిఆర్ఎస్ జగదీశ్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. పంటలు ఎండిపోయి రైతులు అల్లాడుతుంటే కనీసం సమీక్ష కూడా చేయడం లేదన్నారు. ఇదేనా పాలన అంటే అని విమర్శించారు. నల్గొండ జిల్లా కేంద్రంలో జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎంపీ లింగయ్య యాదవ్, ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ఆదివారం నల్లగొండ జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. ఉదయం 9గంటలకు బయలుదేరి భువనగిరి మీదుగా జనగామ వెళ్తారన్నారు. మొదట దేవరప్పులలో ఎండిన పంటలను పరిశీలిస్తారని చెప్పారు. ఆ తర్వాత సూర్యాపేట జిల్లాలోని అర్వపల్లి, తుంగతుర్తి మండలాల్లో ఎండిన పంటలను పరిశీలిస్తారన్నారు. అనంతరం సూర్యాపేట పట్టణంలోని జనగామ రోడ్‌లోని పంటలను పరిశీలిస్తారన్నారు. సూర్యాపేటలో మీడిఆయాతో మాట్లాడుతారని అన్నారు. అక్కడి నుంచి హాలియా, మిర్యాలగూడ రోడ్ పక్కన ఉన్న సాగర్ ఆయకట్టులో ఎండిన పొలాలను పరిశీలించి.. హైదరాబాద్‌కు బయలుదేరుతారన్నారు. ఆరోగ్యం బాగా లేకున్నా రైతుల కష్టాలు చూడలేక కేసీఆర్ ఆదివారం అన్నదాతల వద్దకు వస్తున్నారన్నారు. రేవంత్‌కి పరిపాలనపై సోయిలేదని.. ఇప్పటివరకు వ్యవసాయంపై సమీక్ష లేదని.. మంత్రి కూడా సమీక్ష చేయలేదరన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కేసీఆర్ ఉంటే భూమి ఆకాశనీ ఒక్కటి చేసైనా సరే అన్నదాతలకు నీళ్లు అందించేవారన్నారు. కానీ, ఇవాళ దరిద్రమైన ప్రభుత్వం ఉన్నదన్నారు. రాష్ట్రంలో నీళ్లు అందక లక్షల ఎకరాలు ఎండిపోయా యని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మోర పెట్టుకున్నా ప్రభుత్వంలో కదలిక లేదన్నారు. నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా ఇవ్వలేదని.. ప్రభుత్వం నిర్లక్ష్యంతో అన్నదాతలు ఆగం అయ్యారన్నారు. ÷ళిసీఆర్‌పై కోపంతో రైతులను బలి పెట్టారు కాంగ్రెస్ వాళ్లు.. సాగర్‌లో డెడ్ స్టోరేజ్ నీళ్లు ఉన్నా అప్పుడు నీళు అందించామన్నారు. అన్నదాతలను కాపాడుకున్నామని.. కానీ, ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేదని.. ఎస్సారెస్పీ కింద సూర్యాపేట జిల్లాలో నీళ్లు ఇస్తామన్నారు. పంటలు సాగు చేయండని చెప్పి మరి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. నీళ్ల ఇవ్వక ఎక్కడికక్కడ ఎండిపోయాయని అన్నారు. జిల్లా మంత్రులు అక్రమ వసూళ్లు, దందాలు మొదలుపెట్టారని మండిపడ్డారు. మిల్లర్లను బెదిరింపు చేసి కోట్లు వసూలు చేశారని.. మిల్లర్లు ఏమో అన్నదాతలను పీక్కోని తింటున్నరని విమర్శించారు. కోమటిరెడ్డి ఓ బడ్డారఖాన్.. ఓ జోకర్.. ఆయన మాటలకు ఎక్కడ విలువ లేదన్నారు. ఎంపీ లింగయ్య యాదవ్ రేవంత్ రెడ్డి సీఎం ఉడదం లేదన్నారు. దౌర్భాగ్యం జిల్లాలో నష్టపోయిన రైతులకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు. కేసీఆర్ జిల్లాలో పర్యటిస్తున్నారని, రైతుల అండగా ఉంటారన్నారు. పరిపాలన చేతకాక రేవంత్ అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు కాంగ్రెస్ నయవంచనను అర్థం చేసుకోవాలని కోరారు. రేపటి ఎన్నికల్లో ప్రజలు నిలదీస్తే సమస్యలు తెలుస్తాయని అన్నారు. రైతులకు ఏం సమాధానం చెబుతారో చూస్తామని అన్నారు.



# వ్యవసాయ పొలాలలో గుర్తు తెలియని శివం లభ్యం

– వివరాలు వెల్లడించిన ఎస్సై విఠల్ రెడ్డి



**తాండూర్ మార్చి 30 ప్రజా జ్యోతి :-** తాండూర్ మండలం బెల్కటూర్ గ్రామ శివారులోని ఒక వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని శవం లభించినట్లు కరణ్ కోట్ ఎస్సై విఠల్ రెడ్డి వెల్లడించారు. ఇట్టి వ్యక్తి సుమారు 50 నుంచి 55 సంవత్సరాల ఉంటుందన్నారు. మృతుడి వంటిపై తెలుపు రంగు చొక్క,ఎరుపు రంగు బనియన్, నల్లటి ప్యాంటు ధరించి ఉన్నట్లు వివరించారు. శవాన్ని స్వాధీనం చేసుకున్నాం పోలీసులు తాండూర్ లోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు. తరలించడమైనది. గుర్తుతెలియని శివం పడి ఉన్న పొలం యజమాని నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. ఇట్టి వ్యక్తిని ఎవరైనా గుర్తు పడితే పోలీసు అధికారుల ఫోన్ నంబర్ లను సంప్రదించాలని పేర్కొన్నారు. సెల్ నంబర్లు కరణ్ కోట్ ఎస్సై విఠల్ రెడ్డి, 8712670052 రూరల్ సీఐ అశోక్ 8712670051, అలాగే తాండూరు డిఎస్పి బాలకృష్ణారెడ్డి సెల్ నెంబర్ 8712670017 కు పూర్తి సమాచారం తెలియజేయాలని కోరారు.

# నగదు రూ 50 వేలు మించితే లెక్క చూపాలి

– రూ.9.36 లక్షల నగదు పట్టివేత – తాండూరులో విస్తృత తనిఖీలు

– వివరాలు వెల్లడించిన తాండూర్ డిఎస్పి బాలకృష్ణారెడ్డి




**తాండూరు మార్చి 30 ప్రజా జ్యోతి :-** ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా శనివారం రోజు సంతోష్ కుమార్ నేతృత్వంలో వాహనాల తనిఖీలు చేయగా ఎన్నికల నిబంధనకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న నగదును తాండూరు పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా తాండూర్ డిఎస్పి బాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ కమిషన్ ఆదేశాల మేరకు ఎలాంటి పత్రాలు లేకుండా నగదు డబ్బులు రూ.9 లక్షల 36 వేల నగదును పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. తాండూర్ పట్టణం మల్ రెడ్డి పల్లికి చెందిన బస్వరాజు అనే వ్యక్తి ఎలాంటి పత్రాలు ఆధారాలు లేకుండానే రూ.9లక్షల 36 వేల రూపాయలు తరలిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. ఇట్టి డబ్బులకు సంబంధించిన పత్రాలు గాని ఏ విధమైన ఆధారాలు చూపించకపోవడంతో అట్టి డబ్బులను స్వాధీనం చేసుకొని కలెక్టర్ కార్యాలయంలోని ట్రెజరీకి తరలించామని చెప్పారు.. నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న నగదును జిల్లా కలెక్టర్ ట్రేజరి కార్యాలయానికి పంపించినట్లు డి.ఎస్.పి బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంతకాలం పాటు 24గంటల పాటు పోలీసులు పహారా ఉంటున్నారు. తాండూర్ పట్టణం నుండి వెళ్లే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తామన్నారు. ఎవరైనా వ్యక్తులు తమ అవసరాల నిమిత్తం రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకువెళ్తే లెక్క చూపాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కాశినాథ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

– చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం – చేవెళ్లలో ఓటుపై అవగాహన కోసం 5 కే రన్




**చేవెళ్ల మార్చి 30(ప్రజా జ్యోతి):** అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు నమోదు చేసుకుని ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని చేవెళ్ల ఆర్డిఓ సాయిరాం కోరారు. శనివారం చేవెళ్ల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్విఫ్ ఓటర్ అవగాహన సదస్సులో భాగంగా 5కే రన్ నిర్వహించారు. ఈ రన్ చేవెళ్ల బస్టాండ్ నుంచి షాబాద్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల ఆర్డిఓ సాయిరాం పాల్గొని మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలమైన ఓటును ప్రతి ఒక్కరు కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకొని ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కావద్దని ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత తెలుసుకుని బాధ్యతగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సిఐ లక్ష్మారెడ్డి, స్థానిక ఎమ్మార్వో కృష్ణయ్య, మొయినాబాద్ ఎమ్మార్వో దిలీప్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేష్, మహేందర్, ట్రాఫిక్ ఎస్ఐ విట్టల్ రెడ్డి, అత్తిలి అనంతరెడ్డి, నర్సింలు, అంజి, సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో మోడీ! చేవెళ్లలో కొండ విజయాన్ని ఎవరు ఆపలేరు

– భారతీయ జనతా పార్టీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అత్తెలి అనంతరెడ్డి



**చేవెళ్ల మార్చి 30(ప్రజా జ్యోతి):** దేశంలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దేశంలో మోడి చేవెళ్లలో కొండ విశ్వేశ్వర్ రెడ్డి గెలుపు తథ్యమని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి వెల్లడించారు. దేశంలో మోడి గెలుపును చేవెళ్ల కొండ విశ్వేశ్వర్ రెడ్డి గెలుపును ఎవరు ఆపలేరని త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో గెలిచి నిలిచేది నరేంద్ర మోడీ అయితే చేవెళ్లలో గెలిచి నిలిచేది కొండ విశ్వేశ్వర్ రెడ్డి అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనంత రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... దేశంలో మోడీ చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలే చేవెళ్లలో కొండ విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ప్రజలకు కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు వెల్లడించారు. కొండ విశ్వేశ్వర్ రెడ్డి మచ్చలేని నాయకుడని ప్రజాసేవ సంకల్పంగా ఆయన ప్రజా ప్రస్థానం సాగుతుందని అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో శానిటేషన్ ప్రోగ్రామ్స్ ఆయన జన్మదినం సందర్భంగా మహిళలకు ఉచితంగా అందిస్తున్న కుట్టు మిషన్లు యువతను చైతన్యం చేసేందుకు పార్లమెంటు స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. పార్టీ కార్యకర్తలకు అండదండగా ఉంటూ పార్టీ తలపెట్టిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటు కార్యకర్తలకు సైతం మార్గదర్శి అన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై ఎంపీ ఎన్నికల బరిలో ఉన్న కొండ నేతృత్వంలో బిజెపి జెండా ఎగరవేస్తారన్నారు. కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. బిజెపి కార్యకర్తలు అంతా సమిష్టి కృషితో కొండ విశ్వేశ్వర్ రెడ్డి గెలిపించుకుందామన్నారు.

## సిటీ సివిల్ కోర్ట్ అడ్వకేట్ బార్

# అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా ఎన్నికైన శ్రీ బర్క రాజేష్ కుమార్




**ప్రజాజ్యోతి షాబాద్, మార్చి 30 :** రంగారెడ్డి జిల్లా షాబాద్ పరిధిలోని బోడంపహాడ్ గ్రామానికి చెందిన న్యాయవాది రాజేష్ కుమార్ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఎన్నికల్లో జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ గారు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇంత గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు రంగారెడ్డి జిల్లా ప్రజలందరికీ ఉచిత న్యాయ సలహాలు అందించడానికి తన వంతు బాధ్యత తీసుకుంటానని తెలిపారు. ప్రతి న్యాయవాదికి అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ లీగల్ సేల్ రాష్ట్ర నాయకులు శ్రీ పీసరి సతీష్ రెడ్డి గారు మరియు ఇతర ఆర్గనైజేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలకు మేలు చేసే ప్రభుత్వంతోనే మేము సైతం

# నడుస్తామని మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు అన్నారు



**కుత్బుల్లాపూర్ మార్చ్ 30(ప్రజా జ్యోతి )** ఇటీవల ఆయన బిఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. శనివారం ఆయన సిపిఆర్ కాలనీలో, రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పెద్దలు, శ్రీ కె. యం. ప్రతాప్ , కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు,,యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.పి.విశాల్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ప్రతాప్ బొబ్బరంగారావును పార్టీలోకి ఆహ్వానిస్తూ, పలు సూచనలు చేశారు. నాటినుండి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీతో మాత్రమే పేదల అభివృద్ధి సక్రమంగా జరుగుతుందని తెలిపారు. కేవలం కాంగ్రెస్ పార్టీలో మాత్రమే రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు ప్రతి ఒక్కరికి మర్యాద దక్కుతుందని తెలియజేశారు. లోక్సభ ఎలక్షన్స్ కు ముందుగానే బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు ఉంటాయని ఆయన అన్నారు. మరో 10 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి తిరిగు ఉండదని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజిలి కృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, బాలరాజ్, గార శ్రీనివాస్, బిజిలి శంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా కాంగ్రెస్

### ఉపాధ్యక్షురాలిగా గంగుల అంజలి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రఫియా బేగం నియామకం



**కుత్బుల్లాపూర్ మార్చ్ 30(ప్రజా జ్యోతి )** గంగుల అంజలి యాదవ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా మరియు షేక్ రఫియా బేగంను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి గారు ప్రతిపాదించి తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత మొగిలి రావు నియమించినందున నియామక పత్రాలు అందజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి . ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లడుతూ రానున్న మహిళలని చైతన్యవంతం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రతిఒక్క మహిళకు వివరించి ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించే విధంగా ప్రతి ఒక్కరు పని చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు సుజాత యాదవ్, శ్రీలత, ఫరహీన్ బేగం, నాగ భవాని, శోభ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ జన్మదిన వేడుకలు

– శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అత్తేలి అనంతరెడ్డి



**చేవెళ్ల మార్చి 30(ప్రజా జ్యోతి):** బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ జన్మదిన వేడుకలు చేవెళ్ల బిజెపి బీజేవైఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆయన జన్మదిన సందర్భంగా ఆయన నివాసంలో చేవెళ్ల బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అత్తిలి అనంతరెడ్డి ఆధ్వర్యంలో మహేందర్ ను శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దేశ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటాని అందజేశారు. విద్యార్థి పరిషత్ నుంచి కష్టపడుతూ నేడు రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షునిగా మహేందర్ ఎదిగారన్నారు. ఆయన భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గాజుల గూడెం శ్రీనివాస్ రెడ్డి, బండారి శేఖర్ రెడ్డి, గుర్రాల మహేశ్వర్ రెడ్డి, వడ్డే గణేష్ జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవుల ఐక్యతను చాటేందుకే రన్ ఫర్ జీసస్ ర్యాలీ

మండల చైర్మన్ కే సంజీవ



**యాచారం, మార్చి 30 (ప్రజాజ్యోతి):** మండల క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకొని రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో భాగంగా క్రైస్తవ సోదరులు సాయి శరణం గార్డెన్ నుంచి గాండ్లగూడ ఎక్స్ రోడ్డు వరకు అంబేద్కర్ చౌరస్తా నుంచి నంది వనపర్తి రోడ్డు లోని మినిస్ట్రీస్ చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల చైర్మన్ కే సంజీవ, సెక్రటరీ కె భాస్కర్ మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల క్రైస్తవుల ఐక్యతను చాటడానికే రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఏ. ప్రభాకర్, సలహాదారులు ఎంజే సామేల్, బాలరాజు, జీఎం ప్రభాకర్, యూత్ చైర్మన్ జోసెఫ్, ఎం జె. జాన్సన్, సభ్యులు ఇర్మియ, దానేల్ తదితరులు పాల్గొన్నారు.

## మెడిటేక్ హాస్పిటల్ నిరుపేదలకు చేస్తున్న సేవలు అభినందనీయం

– హాస్పటల్లో చికిత్స పొందుతున్న ఇద్దరిని పరామర్శించిన మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్



**కూకట్ పల్లి, మార్చి 30 (ప్రజా జ్యోతి)** జగద్గిరిగుట్ట పరిధిలోని మెడిటిక్ హాస్పిటల్ వారు నిరుపేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్ నగర్ లో నివాసముండే హరీశ్వర్ రెడ్డి, గీత అనే ఇద్దరు వేరువేరు సంఘటనలో అనారోగ్యంతో ఉండి జగద్గిరిగుట్ట పరిధిలోని మెడిటెక్ హాస్పిటల్ లో నిరుపేదలకు మంచి వైద్యాన్ని కల్పిస్తున్నారని తెలిసి మహబూబ్ నగర్ నుండి వచ్చి హాస్పిటల్ లో చికిత్స నిమిత్తం చేరారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సొంత నియోజకవర్గము నుండి వచ్చారని విషయం తెలుసుకున్న వెంటనే శ్రీనివాస్ గౌడ్ మెడిటెక్ హాస్పిటల్ కి వచ్చి వారిరువురిని పరామర్శించి, హాస్పిటల్ ఎండి గోపికృష్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీలో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. నిరుపేదల నివసించే జగద్గిరిగుట్ట ప్రాంతంలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించి నిరుపేదలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, చంద్రారెడ్డి, పాపిరెడ్డి, లక్ష్మమ్మ, భగవంతు రెడ్డి, సంజీవరెడ్డి, ప్రభాకర్ రావు, భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్ టిఎస్ఓ కాంపిటీషన్‌లో శ్రీ చైతన్య పాఠశాల ప్రభంజనం

– లాప్ టాప్‌ను గెలుచుకున్న విద్యార్థి



**ఇబ్రహీంపట్నం, మార్చి 30 (ప్రజాజ్యోతి):** నియోజవర్గ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ కాంపిటేషన్ ఫైనల్ ఫలితాల్లో శ్రీ చైతన్య పాఠశాల ప్రభంజనం సృష్టించింది. దీనిలో భాగంగా మొత్తం 400 మంది విద్యార్థులు పరీక్ష రాయగా మొదటి రెండు గ్రాండ్ ప్రైజులతో పాటు నాలుగో ప్రైజ్ ఇద్దరికీ ఐదో ప్రైస్ ఒక్కరికి మొత్తం 389 మంది విద్యార్థులు గ్రాండ్ ప్రైజులు గెలుచుకోగా గోల్డ్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ ను సాధించారు. శ్రీ చైతన్య పాఠశాల 9వ తరగతి విద్యార్థి కంబాలపల్లి మేఘన మొదటి బహుమతిగా లాప్ టప్ ను గెలుచుకుంది. ఐఎన్ టిఎస్ఓ రెండవ గ్రాండ్ ప్రైజ్ టాబ్ ను ఐదవ తరగతి విద్యార్థి కాంటేకర్ రిత్విని సాధించింది. వందలాది పాఠశాల్లో వేలాదిమంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో ఇబ్రహీంపట్నం శ్రీ చైతన్య విద్యార్థులకు మొదటి బహుమతి రావడం గర్వకారణమని శ్రీ చైతన్య పాటించే కరికులం ప్రత్యేకతయని పాఠశాల జోనల్ ఎజీఎం ఖాసీం అలీ అన్నారు. తమ ఉపాధ్యాయుల ప్రోత్సాహం కృషి ఫలితంగా, విద్యార్థుల కటోర సాధన తోనే విజయాలు సాధిస్తున్నట్లు దీనికి శ్రీ చైతన్య పటిష్టమైన ప్రణాళిక పద్ధతులే కారణమని ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ అన్నారు. జోనల్ కోఆర్డినేటర్ డి రమేష్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం బ్రాంచ్ అన్ని రకాల పరీక్షల్లో విజయ ప్రభంజనం సృష్టించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డీన్ రాకేష్, ఐఎన్టిఎస్ఓ ఇంచార్జ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

## బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలి




**సిద్దిపేట ప్రతినిధి ప్రజాజ్యోతి :** రాబోయే ఎంపీ ఎన్నికల్లో విద్య వ్యతిరేక విధానాలను ఆవలంభించిన బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా నిర్మాణ బాధ్యులు మంద పవన్ లు పిలుపునిచ్చారు.. శనివారం రోజు సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్న బీజేపీ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ మౌళిక సూత్రాలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం(ఎన్ఇపి)-2020 లోపాలపుట్టని, విద్యా కాషాయీకరణ, విద్యా ప్రైవేటీకరణ, విద్యా కేంద్రీకరణ కోసమే నూతన విద్యా విధానమని, ప్రజలందరూ దీనిని తిరస్కరించాలని ఆయన అన్నారు.. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని, దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం-2020 తీసుకొచ్చారని విమర్శించారు. విద్యా కార్పొరేటికరణ, కాషాయికరణ, కేంద్రీకరణ చేయాలని కేంద్రం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. దేశంలో జాతీయ విద్యా విధానం వల్ల దాదాపు 90% విద్యార్థులు నాణ్యమైన విద్య పొందే హక్కును కోల్పోతారని, విద్యా వ్యాపారీకరణ వలన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం దూరం చేస్తూ, రాష్ట్రాల హక్కులను కాలరాసారని మణికంఠ ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం దేశంలోనే సుసంపన్నమైన, వైవిధ్య భరితమైన భిన్నత్వంలో ఏకత్వానికి బదులు విద్యాకాషాయికరణ హిందుత్వ ఆధారిత రాజ్యాన్ని, సమాజాన్ని స్థాపించడానికి బాటలు వేస్తుందన్నారు. ఈ విద్యా విధానంలో ప్రైవేటు విశ్వవిద్యాలయలను, విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతిస్తారని తెలిపారు. ఇలాంటి లోపాల పుట్ట ఉన్న నూతన జాతీయ విద్యా విధానంను ప్రజలందరూ తిరస్కరించాలని అన్నారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక మూడు రాష్ట్రాలు నూతన జాతీయ విద్యా విధానం తిరస్కరిస్తున్నట్లు తీర్మానం చేశాయని, అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా నూతన జాతీయ విద్యా విధానం వ్యతిరేకిస్తున్నట్లు అసెంబ్లీ తీర్మానం చేయాలని ఆయన వారు డిమాండ్ చేశారు. సమావేశ అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గా వేల్పుల ప్రసన్న కుమార్, గర్ల్స్ కన్వీనర్ గా ఆకుల శిరీష ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగెం మధు, జేరిపోతుల జనార్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్ లు పాల్గొన్నారు.

## మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపు ఖాయం

**జగదేవపూర్, మార్చి 30(ప్రజాజ్యోతి):** ఎంపీ ఎన్నికలో మెదక్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీల%శీ%మధు ముదిరాజ్ గెలుపు ఖాయమని జగదేవపూర్ మండల్ బీజీ వెంకటాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చెక్కల కృష్ణ ముదిరాజ్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మెదక్ ఎంపీగా యువ నాయకుడు నీలం మధు ముదిరాజ్ ను భారీ మెజారిటీతో విజయం ఖాయమని బిజెపి పార్టీకి క్యాడర్ లేదు బిఆర్ఎస్ పార్టీనీ ప్రజలు నమ్మేస్థితిలో లేరని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీల దశల వారిగా అమలు చేస్తూ ప్రజా పరిపాలన కొనసాగిస్తుందని పేదల ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని రాబోయే ఎన్నికల్లో ఎక్కువ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని మెదక్ నుండి నీలం మధు ముదిరాజ్ అత్యధిక మెజార్టీతో గెలుపు ఖాయమని అన్నారు.



# తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేత



**చిన్నకోడూర్, మార్చి 30 (ప్రజా జ్యోతి):**మండల కేంద్రం లో పొద్దుతిరుగుడు కొనాలని తహసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు .మండల కేంద్రంలో మార్కెట్ యార్డ్ ముందు ధర్నా నిర్వహించి. తహసిల్దార్ కు వినతిపత్రం రైతులు అందరం కలిసి అందజేసినమన్నారు. గత నెల రోజులనుంచి రైతులు పొద్దుతిరుగుడు పంటను మార్కెట్లో ఆరబోసి జల్లి పట్టి 25 రోజుల నుంచి రైతులు పడిగాపులు కాస్తున్నారు .మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మండలంలోని అందరి రైతుల పంటను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అధికారులు తూతూ మంత్రంగా కొంతమంది పంటను కొనుగోలు చేసి తీరా సమయానికి బార్ధన లేదని ప్రభుత్వానికి సరిపోయినంత సరుకు కొన్నామని ఇప్పుడు ప్రభుత్వం నుంచి ఎక్కువ పొద్దుదరుడు పంటను కొనాలని ఆదేశాలు వస్తే తప్ప మేము కొనుగోలు చేయమని కరాకండిగా స్థానిక సిబ్బంది చెప్తున్నారు ఇటువంటి నిర్ణయము రైతుల మీద చూపడం సరైనది కాదని మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .రెండు రోజులలో పొద్దుతిరుగుడు కొనుగోలు చేయకపోతే ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు .ఈ కార్యక్రమాలు తెలంగాణ రైతు సంఘం మండల కమిటి చల్లారపు తిరుపతిరెడ్డి,నాకిరెడ్డి ,బాల్ రేడ్డీ, రాగిరి నరసింహులు రాపోలు శ్రీనివాస్ రెడ్డి ,అంబటి పోచయ్య, బాలయ్య నాగిరెడ్డి ,రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

### రంజాన్ మాసం సందర్భంగా పేద ముస్లిం

## వర్గాలకు సరుకులు పంపిణీ చేసేలా అనుమతి ఇవ్వాలి



**సిద్దిపేట మార్చి30,(ప్రజాజ్యోతి) :** రంజాన్ మాసం సందర్భంగా ప్రతి సంవత్సరము పేద ముస్లిం వర్గాలకు చెందిన వారికి హైద్రాబాద్‌కు చెందిన ఆర్.ఆర్ సంస్థ వారు, జఖాత్ ద్వారా ప్రతి ఒక్కరికి సరుకుల పంపిణీ చేస్తుంటారు. అందులో భాగంగానే సిద్దిపేటలో కూడా ప్రతి సంవత్సరం నిత్యావసర సరుకులు పేద ప్రజలు రంజాన్ పండుగ ఘనంగా చేసుకోవాలని, వారికి పంపిణీ చేయడానికి తీసుకవచ్చిన నిత్యావసర సరుకుల పంపిణీకి అనుమతి ఇవ్వాలని, అలాగే తంజీమ్ కమిటీకి గానీ, అధ్యక్షులకు గానీ, కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదు. ఈ కమిటీలో ప్రతి పార్టీకి చెందిన వారు సేవ చేస్తూనే ఉంటారు. కమిటీ అధ్యక్షులు ఇతర పార్టీకి చెందిన వారిచ్చిన ఫిర్యాదుకు, పంపిణీకి ఎలాంటి సంబంధం లేదు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి నియోజక వర్గంలో రంజాన్మాసంలో జఖాత్ పంపిణీలు జరుగుతూనే ఉన్నాయి. సిద్దిపేటలోనే నిలిపివేసినారు. ఇలా చేయడం వల్ల బీద ప్రజలు రంజాన్ మాసంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. రేషన్ కిట్స్ పంపిణీకి ఎలాంటి రాజకీయ సంబంధం లేదు. కాంగ్రెస్ పార్టీ బీద ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ ఈ సరుకుల పంపిణీకి ఎలాంటి అభ్యంతరం తెలుపడం లేదు. సంబంధిత అధికారుల ద్వారా కేవలం రంజాన్ మాసం 10 రోజులే మిగిలి ఉన్నది. అధికారులకు ఆదేశాలు ఈచ్చి , నిత్యావసర సరుకులను పేద ప్రజలకు పంపిణీ చేయాలని కలెక్టర్ ను కోరారు.

## ఫిర్యాదు పై విచారణ చేపట్టిన విద్యాశాఖ అధికారి



**ప్రజా జ్యోతి, సిద్దిపేట, కొండపాక :** సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో పదవ తరగతి పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్ ఒక బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించారన్న ఫిర్యాదు పై విద్యాశాఖ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ఈ నెల 26 న భౌతిక శాస్త్రం పరీక్ష రోజు తన పట్ల ఇన్విజిలేటర్ అసభ్యకరంగా ప్రవర్తించడంటూ ఓ విద్యార్థిని సుపరిండెంట్ లక్ష్మి కి ఇచ్చిన పిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని తెలిపారు.

## ఉత్కంఠ నడుమ వీగిన వైస్ ఎంపీపీ అవిశ్వాసం



**ప్రజా జ్యోతి, సిద్దిపేట, కొండపాక :** సిద్దిపేట జిల్లా కొండపాక మండల వైస్ ఎంపీపీ పై ఆర్డీవో బన్సీలాల్ కు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం ఈరోజు ఉత్కంఠ నడుమ వీగిపోయింది. ఎంపీపీ పై ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై ఈనెల 28న ఆర్డీవో సమక్షంలో ఓటింగ్ నిర్వహించగా కోరం ఉండటంతో ఎంపీపీ పదవి కోల్పోయారు. అదే తరుణంలో వైస్ ఎంపీపీ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం కూడా నెగ్గుతుందని, వైస్ ఎంపీపీ కూడా తమ పదవిని కోల్పోతారని మండల వ్యాప్తంగా చర్చ నడిచింది. కానీ అనూహ్యంగా 9 మంది ఎంపీటీసీల్లో ఒకరు గైర్హాజరవగా అవిశ్వాసం వీగిపోయింది. దీంతో వైస్ ఎంపీపీగా దేవి రవీందర్ కొనసాగనున్నట్లు ఆర్డీఓ తెలిపారు.

# రంజాన్ మాసంలో పేదవారి పొట్ట కొట్టొద్దు

– రేషన్ పంపకంలో రాజకీయాలు వద్దు




**సిద్దిపేట మర్చి30, (ప్రజాజ్యోతి):** పవిత్ర రంజాన్ మాసంలో తాము సంపాదిస్తున్న ఇన్కమ్ నుండి పేద వారి కడుపు నింపడానికి తీసే జకాత్ వితరణ పై అనవసర రాజకీయాలు చేసి పెదవారి పొట్ట కొట్టవద్దని సిద్దిపేట కు చెందిన మైనారిటీ నాయకులు వజీర్, మొయిజ్, జవేద్ లు విజ్ఞప్తి చేశారు. శనివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా ఆర్ ఆర్ గ్రూప్స్ వారు జకాత్ వితరణను రాష్ట్రంలో అన్నిపట్టణాలకు పంపించినట్టే సిద్దిపేటకు కూడా పంపించారు. వారు పంపిన రేషన్ సామగ్రి ఏ రాజకీయ పార్టీకి సంబంధము లేదని అలాంటిది అనవసర రాజకీయాలు చేసి పేదోల్లా కడుపు కొట్టొద్దన్నారు.ఇపుడున్న ప్రజలు గుర్తించని తంజీమ్ అధ్యక్షుడు ఎజాజ్ హాఫిజ్,అలాగే కాంగ్రెస్ నాయకులు కొంతమంది రేషన్ పంపిణీ చేయవద్దని కేసులు చేయడం సిగ్గుచేటన్నారు. ఆర్ ఆర్ గ్రూప్ వారు వారి మంచితనం తో పేదవారికి సహాయం చెయలన్నా ఉద్దేశ్యంతో వ్యక్తిగతం గా పంపిన జకాత్ రేషన్ ని పేదలకు పంచ్చాల్సిందేనన్నారు. దాదాపు మూడు వేల కుటుంబాలకు సరిపడా రేషన్ ఇప్పటికి మదిన ఫంక్షన్ హాల్ లో ఉందని దాన్ని వెంటనే పేదలకు పంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే ఎన్నికల అధికారులు కూడా ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ చూపి సమస్యను పరిష్కరించి పేదవారిని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో,మన్సూర్ సయీద్,గోరు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కి వినతి



**ప్రజా జ్యోతి, సిద్దిపేట, కొండపాక/కలెక్టరేట్ :** పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి పై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనోజ్ చౌదరికి వినతిపత్రం ఇచ్చినట్లు జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి దాసరి ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 న భౌతిక శాస్త్రం పరీక్ష రోజు తన పట్ల ఇన్విజిలేటర్ అసభ్యకరంగా ప్రవర్తించడంటూ ఓ విద్యార్థిని సుపరిండెంట్ కి ఫిర్యాదు చేసిందని ఇప్పటివరకు ఆ ఉపాధ్యాయునిపై శాఖా పరమైన చర్యలు తీసుకోలేదని, అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రభుత్వ టీచర్ల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా నంగునూర్ పాఠశాల జరిగిన కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారిపై కూడా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రెడ్డమైన అరవింద్, కొండంసంజీవ్ కుమార్, ఆముదాల రంజిత్ రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

## లక్ష్మీ అకాల మరణం చాలా బాధాకరం



**తొగుట మార్చ్ 30( ప్రజా జ్యోతి )బీ** మండలంలోని వెంకట్రావుపేట కు చెందిన మక్కల మల్లేశం సతీమణి లక్ష్మి (38) అనారోగ్యంతో బాధ పడుతూ గుండె పోటుతో మరణించింది..విషయం తెలుసుకున్న మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పార్థీవ దేహాన్ని దర్శించి నివాళి అర్పించారు.లక్ష్మి భర్త మల్లేశం తో పాటు కుమార్తెలను ఓదార్చారు..తన వంతుగా రూ.3000 ఆర్థిక సహాయం అందించారు.. లక్ష్మి మరణంతో ముగ్గురు కుమార్తెలు కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే చూపరులు కన్నీరు పెట్టారు..పరామర్శించిన వారిలో గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పులిగారి శివయ్య, నాయకులు జీడిపల్లి కొండల్ రెడ్డి, సుతారి రాములు, బండారు స్వామి గౌడ్, ఈదుగాళ్ల పర్శరాములు, పాత్కుల రాజు, వెంకట్ ఉన్నారు.

## వ్యభిచార గృహాలపై పోలీసుల దాడులు

– తహశీల్దార్ ముందు వేశ్యల బైండోవర్

**వేములవాడ, మార్చి 30, (ప్రజాజ్యోతి):** వేములవాడ డిఎస్పీ నాగేంద్ర చారి ఆధ్వర్యంలో శిశు సంక్షేమ అధికారులతో వేములవాడలో ఉన్న మహా లక్ష్మి వీధిలో ఉన్నటువంటి వ్యభిచార గృహాలపై శనివారం దాడులు చేశారు. వ్యభిచారము నిర్వహిస్తున్నటువంటి కంసాని లక్ష్మి, వేములవాడ పట్టణానికి చెందిన కంసాని రోజా, కంసాని రోహిణి, కంసాని మంగ, నానావత్ దేవి, కంసాని లత, కంసాని ఉదయశ్రీ, కంసాని భారతి, అంగోతు రోజా, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన భూక్య పద్మ, కంసాని లత, వేములవాడ పట్టణానికి చెందిన కంసాని శ్రీమల, వేములవాడ పట్టణానికి చెందిన కామసాని ప్రియ, కంసాని రాజ్య లక్ష్మిలను పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చి, వేములవాడ తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు.

# కాలు మొక్కిన కనికరించేది లేదు

- భుకబ్జాదారులే పార్టీలు మారుతున్నారు
- కాంగ్రెస్ అంటేనే కరువు - ఆరు గ్యారంటీలు ఆరవై అబద్దాలు
- ఎంపిగా వెంకట్రామిరెడ్డిని గెలిపించుకుందాం
- వంద కోట్లతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు - పార్టీ కార్యకర్తల పిల్లలకు విద్యావకాశాలు



**జగదేవపూర్, మార్చి 30(ప్రజాజ్యోతి):** కష్టకాలంలో వాటిని విడిచి పెట్టిన వాళ్లను తిరిగి పార్టీలోకి వస్తామని కాలు మొక్కిన కనికరించేది లేదని, ఆరు నెలలు ఓపిక పట్టండి భవిష్యత్ మనదేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు. శనివారం షామీర్ పేట్ లోని అరణ్య అతిథి గృహంలో గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీని విడిచిపెట్టి మళ్ళీ పార్టీలోకి వస్తామని కాలు మొక్కినా వారిని తీసుకోబోమని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అంటేనే కరువుకు చిరునామని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి వంద రోజులు అయినప్పటికీ ఆరు గ్యారెంటీ అమలు 60 అబద్ధాలుగా కొనసాగుతుందని ఆరోపించారు. ఉద్దెర పథకాలు ఉతుత్త హామీలతో ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతుందని ఎద్దవా చేశారు. నాలుగు వేల ఫించన్, పదిహేను వేల రైతుబంధు, వ్యవసాయ కూలీలకు 12,000 చెల్లిస్తానని చెప్పిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని ఉద్దెర పథకాలు ఉత్తుత హామీలు అంటూ ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ప్రాంతం పచ్చని మాగాణిగా మారితే కాంగ్రెస్ ప్రభుత్వంలో బీటలు వారిన పొలాలు కాలిపోయిన మోటర్లు ట్రాన్స్ ఫార్మర్లు దర్శనమిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో 150 కోట్ల పనులు రద్దు చేశారని, కాంగ్రెస్ నాయకులు ఏ విధంగా ఓట్లు అడుగుతారని సమాధానం చెప్పాలన్నారు. రద్దు చేసిన పనుల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని కోరారు. ఇకనుండి నా ప్రాణం అడ్డుపెట్టి మీ వెంట ఉంటామని కార్యకర్తలు నిరాశ గురి కావద్దని చెప్పారు. భూములు కబ్జా చేసిన వారే ఊసరెల్లి రంగులు మారుస్తూ పార్టీలు మారుతున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ అంటే ఉద్యమం పార్టీ అని, వలసవాదులు వచ్చి వెళ్లిన ఉద్యమకారులు నిలిచి మళ్ళీ అధికారం వైపు అడుగులు వేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. 10 ఏళ్ల పాలనలో ఎవరిని వేధించలేదని చీమెత్తు అపకారం కూడా చేయలేదని పేర్కొన్నారు. కేసీఆర్ ఉండగా రాష్ట్ర గౌరవాన్ని నిలబెట్టారని 50 ఏళ్ళు అభివృద్ధి పదేళ్లలో జరిగిందని ఇది తెలంగాణ ప్రజలకు తెలుసని చెప్పారు. పంటలు ఎండిపోతే రాత్రి ఫోన్ చేస్తే తెల్లారి కాలువల పొంటి కూడవెల్లిలోకి నీళు విడుదల చేసిన సంగతి తెలంగాణ ప్రజలకు తెలుసు అన్నారు. ఆరోగ్యం మంత్రిగా నేను ఉన్నప్పుడు రాష్ట్రంలో వైద్య సేవలు ఎలా ఉండవో నేడు ఎంతగా దిగజారిపోయిందో ప్రస్తుతం హాస్పిటల్ లా పరిస్థితి చూస్తే అర్థమవుతుందన్నారు. వెంకటరామిరెడ్డి మనసున్న వ్యక్తి అని 100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి కార్యకర్త విభేదాలు వీడి జీద్దుగా బిఆర్ఎస్ గెలుపు కోసం సైనికులుగా వెంకటరామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గజ్వేల్ పై కేసీఆర్ కున్న ప్రేమ రఘునందన్ రావుకు ఉంటుందా గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేకనే రఘునందన్ రావు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురించి గ్రామాల్లో చర్చ పెట్టి వివరించాలని కోరారు.

**ఆఫర్ ఇచ్చిన వదులుకున్న..**

కాంగ్రెస్ నేతలు మెదక్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇస్తామని ఆఫర్ చేసిన తిరస్కరించినని బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో జాయింట్ కలెక్టర్ నుండి జిల్లా కలెక్టర్ వరకు జిల్లాకు ఎన్నో సేవలు చేశానని తెలిపారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ తర్వాత కేసీఆర్ వద్ద పనిచేశానని పేర్కొన్నారు. కుటుంబంలో విభేదాలు ఉన్న కష్టం వస్తే ఒకటైనట్లు మీరంతా కలిసి మెలిసి తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. గులాబీ జెండాను గుండెల పెట్టుకోవాలని తనను మనసులో ఉంచుకోవాలని కోరారు. 100 కోట్లతో పివిఆర్ ట్రస్టు ద్వారా పార్టీ కార్యకర్తలకు విద్య అవకాశాలు కల్పిస్తానని త్వరలోనే ట్రస్ట్ వివరాలను ఆన్ లైన్లో పెడతానని తెలిపారు. గెలిచిన ఏడాదిలోనే ఏడు నియోజకవర్గాల్లో ఫంక్షన్ హాల్ నిర్మిస్తానని పేర్కొన్నారు. జిల్లాలో చాలామందికి ఆపద కాలంలో అండగా నిలిచానని వివరించారు. గజ్వేల్ తో ఉన్న అనుబంధం చాలా గొప్పదని భారత దేశంలోనే అభివృద్ధిలో టాప్ టెన్ లో సిద్దిపేట జిల్లా నిలవడం గర్వకారణం అన్నారు. 50 ఏళ్ల అభివృద్ధి పదేళ్లలో కెసిఆర్ చేపట్టారని పేర్కొన్నారు. అనంతరం ఎఫ్ డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ గడ్డ మెదక్ లో బిఆర్ఎస్ గెలవడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. మన అభ్యర్థి వెంకటరామిరెడ్డి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. పార్టీలో గ్రూపులు బంద్ చేసి గుంపుగా ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం సైనికులుగా పని చేయాలని కోరారు. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచినప్పుడే పార్టీలో గౌరవం పెరుగుతుందని అన్నారు. ఏప్రిల్ 2న గజ్వేల్ లోని శోభ గార్డెన్ లో నియోజవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు ఉంటుందన్నారు. ఎన్నికల్లో డిపాజిట్ రాని వ్యక్తి కూడా కుట్ర పూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ హాయంలో గజ్వేల్ లో పదివేల కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. సమావేశంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, రాష్ట్ర నాయకులు శేఖర్ గౌడ్, నరసింహారెడ్డి, జెడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, మల్లేశం, మంగమ్మ రామచంద్రం, ఎంపీపీలు బాలేశం గౌడ్, పాండుగౌడ్, అమరావతి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు గుండా రంగారెడ్డి, కృష్ణారెడ్డి, మద్దూరు శ్రీనివాస్ రెడ్డి, దేవి రవీందర్, శ్రీనివాస్ గౌడ్, కవితా శ్రీనివాస్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, కనకయ్య, బాల్ రెడ్డి, బిక్షపతి పాల్గొన్నారు.

# చదువుతూనే మనోవికాసం

- ఎంఎన్ఓ వెంకటేశం పదవి విరమణ



**సిద్దిపేట మార్చి 30( ప్రజాజ్యోతి)** చదువుతోనే మనోవికాసం చెందుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, ప్రముఖ మానసిక వికాస నిపుణులు వీరేందర్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండల ఎంఎన్ఓ మందపల్లి ఉన్నత పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు బెజుగామ వెంకటేశం పదవి విరమణ సమావేశం సిద్దిపేటలోని ఫంక్షన్ హాల్ లో శనివారం జరిగింది. సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని వెంకటేశం విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు సమాజసేవలో ప్రధాన పాత్ర పోషించాడని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజ అభివృద్ధికి వెంకటేశం చేసిన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఎంత దగ్గరవుతే వారి విద్యాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిఇఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ యాదవ రెడ్డి తదితరులు మాట్లాడారు. వెంకటేశం దంపతులను ఎమ్మెల్సీ తో పాటు ఆయన స్నేహితులు బంధువులు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

# భావి భారత నిర్మాతలు విద్యార్థులు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రగోతం రెడ్డి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ రోజా శర్మ
- ఘనంగా కాకతీయ టెక్నో స్కూల్ వార్షికోత్సవం - అలరించిన చిన్నారుల ఆటపాటలు




**సిద్దిపేట టౌన్ ప్రజాజ్యోతి :** నేటి విద్యార్థులే రేపటి భావిభారత నిర్మాతలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రగోతం రెడ్డి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ రోజా శర్మలు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాకతీయ ఈ టెక్నో హై స్కూల్ 14వ వార్షికోత్సవం శనివారం ఉపాధ్యాయ భవన్( టిటిసి భవన్) లో ఘనంగా జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కూర రగోతం రెడ్డి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ రోజా శర్మలు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రముఖ విద్యావేత్త జగ్గు మల్లారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాకతీయ ఈ టెక్నో స్కూల్ అన్ని రంగాల్లో రాణించడం విశేషం అన్నారు. జగ్గు మల్లారెడ్డికి విద్య వ్యవస్థలో అశేష అనుభవం ఉందన్నారు . ఉపాధ్యాయ వృత్తి చాలా కీలకమైందని , ఒక ఉపాధ్యాయుడు దేశాన్ని అభివృద్ధి చేయడంలో ముఖ్య భూమిక వహిస్తాడన్నారు. ఒక ఉపాధ్యాయుడు ఇంజనీర్, డాక్టర్, రాజకీయవేత్త, ఇలా అన్ని రంగాల్లో రాణించే విధంగా తమ విద్యార్థులను తీర్చిదిద్దగలుగుతారన్నారు. అనంతరం విద్యార్థులు తమ ఆటపాటలతో తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, అతిథులను ఆనందింప చేశారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా నర్సరీ నుండి 9వ తరగతి వరకు విద్యార్థులు గ్రూప్ల వారిగా విడివిడిగా తమ ప్రదర్శనలను ప్రదర్శించారు. దీంతో విద్యార్థుల కేరింతలతో అక్కడి వాతావరణం సందడిగా మారింది అనంతరం విద్యార్థులకు పట్టాలు అందించారు. ఆటపాటలతో రాణించిన విద్యార్థులకు మోడల్స్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మండల విద్యాధికారి యాదవ రెడ్డి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# శాంభవి మోడల్ స్కూల్లో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం




**ప్రజా జ్యోతి, సిద్ధిపేట, కొండపాక :** సిద్ధిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దుద్దెడలోని శాంభవి మోడల్ స్కూల్ లో శనివారం లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిద్దిపేట జిల్లా జడ్జి డా. టి. రఘురాం రాజ్యాంగం లో ఉన్నటువంటి ప్రాథమిక హక్కుల గురించి, ఫోక్సో చట్టాల గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలు బట్టి విధానానికి స్వస్తి పలికి పాఠ్యాంశాలను అవగాహన చేసుకునప్పుడే పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారని తెలిపారు. పిల్లలు మొబైల్ ఫోన్స్ కు దూరం గా ఉండాలని, మొబైల్స్ వాడకం వల్ల పిల్లలు మానసికంగా ఇబ్బందులు పడతారని ఆ ప్రభావం మెదడు పై పడుతుందని తెలిపారు. విద్యార్థులు తెలిసి తెలియక ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్ లో అనవసరమైన పోస్టింగ్లు పెట్టి ఇబ్బందులకు గురి అవుతు న్నారన్నారు. మొబైల్ ఫోన్స్ వాడుతూ విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా విద్యార్థులు వాహనాలను నడపడం చట్టరిత్యనేరమని తెలిపారు. ఈ కార్యక్రములో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి. ఎస్. స్వాతి రెడ్డి, ఏసిపి మధు, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, పాఠశాల ప్రిన్సిపల్ మిద్దె రమేష్, కరస్పాండెంట్ లక్ష్మి సుజాత న్యాయసేవ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఖజానా కార్యలయంలో రేపు యధావిధిగా సేవలు

## - జిల్లా ఖజానా అధికారి చిన్న సాయిలు



**మెదక్ ప్రతినిధి ప్రజాజ్యోతి :** స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఖజానా కార్యాలయం రేపు ఆదివారం అయినా 2023-2024 వ ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావున జిల్లా ఖజానా కార్యాలయంలోని సేవలు యధావిధిగా అందిస్తామని జిల్లా ఖజానా అధికారి చిన్న సాయిలు తెలిపారు.ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు బడ్జెట్ బిల్లులు, ఉద్యోగుల జీతాలు, చెక్కుల జమ లాంటి సేవలందించబడతాయన్నారు.అలాగే నర్సాపూర్, రామాయంపేట ,తూప్రాన్ లో ఉన్న ఎస్ .టి .ఓ కార్యాలయాలు కూడా సేవలందించబడతాయని జిల్లా ఖజానా అధికారి చిన్న సాయిలు పేర్కొన్నారు.

# మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా విజయం ఖాయం

## - రాయపోల్ మండల బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు వెంకట్ గౌడ్



**రాయపోల్ :మార్చి 30 ప్రజా జ్యోతి** మెదక్ పార్లమెంటు అభ్యర్థి మాజీ కలెక్టర్ ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి నీ భారీ మెజార్టీతో గెలిపించి కెసిఆర్ కు కానుకగా ఇస్తామని రాయపోల్ మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు అనాజిపూర్ వెంకట్ గౌడ్ స్పష్టం చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని పథకాలను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని ఆయన గుర్తు చేశారు తెలంగాణ ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించిన ఘనత ఉద్యమ నేత కెసిఆర్ కే దక్కిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఎడారిగా మారిందని. తెలంగాణ స్వరాష్ట్రంలో కోటి ఎకరాల మాగానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో కెసిఆర్ ముందు చూపుగా ఆలోచించి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్ కుండ పోచమ్మ ప్రాజెక్టుల ద్వారా కాలువ ద్వారా సాగునీరు అందిందించి తెలంగాణను సస్యశ్యామలం చేయడమే కెసిఆర్ లక్ష్మన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేసిన రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని నీ భారీ మెజార్టీతో గెలిపించి కెసిఆర్ కు కానుక ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

# మార్నింగ్ వాకర్స్‌ను కలిసీ బీజేపీకీ మద్దతుగా నిలబడాలని కోరిన బిజెపి పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్



**వనపర్తి టౌన్, మార్చి 30(ప్రజా జ్యోతి):** వనపర్తి పట్టణంలోనీ జూనియర్ కళాశాల గ్రౌండ్, పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్, ఏకో పార్క్ లలో శనివారం ఉదయం బిజెపి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ మార్నింగ్ వాకర్స్ ను కలుస్తూ బిజెపికి మద్దతుగా నిలబడాలని కోరారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాకర్స్ తో బిజెపి అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్ పార్లమెంట్ వేగంగా అభివృద్ధి చెందాలంటే మూడవసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ గద్దెనిక్కాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఐదవ స్థానంలో ఉన్న భారత్ మూడవ స్థానానికి చేర్చడమే గ్యారెంటీగా పెట్టుకున్న నరేంద్ర మోడీకి మద్దతుగా నిలబడాలని వారు కోరారు. ఆర్థిక వ్యవస్థ పురోగమన దిశలో ఉండి పరిశ్రమల ఏర్పాటుతో 140 కోట్ల జనాభాలో అత్యధిక శాతం ఉన్న యువత ఉపాధి అవకాశాలతో అగ్రరాజ్యాలతో పోటీ పడడం ఖాయమని కావున అందరూ నరేంద్ర మోడీకి మద్దతుగా నిలబడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హయాంలో తెలంగాణ రాష్ట్రంలోనే సూర్యాపేట తర్వాత ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోనే అత్యధిక కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని ఆసియాలోని ఒక మోడల్ ఐకాన్ బ్రిడ్జి సోమశిల దగ్గర నిర్మించబోతున్నారని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కూడా ఆర్థిక పురోగమన దిశలో దూసుకుపోతుందని బిజెపి పార్టీ లక్ష్యమైన 400 సీట్లలో నాగర్కర్నూల్ పార్లమెంటు స్థానం కూడా ఉండేలా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అభ్యర్థిగా అవకాశం వచ్చిన నన్ను ఆశీర్వదించి మోడీ ఆధ్వర్యంలో దేశ సేవ చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్ లోకనాథ్ రెడ్డి, మెంటపల్లి పురుషోత్తం రెడ్డి, ఏ రామన్ గౌడ్, సీతారాములు, సుమిత్రమ్మ, కుమారస్వామి, ఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, బాశెట్టి శీను, శ్రీనివాస్ గౌడ్, చిత్తారి ప్రభాకర్, పెద్దిరాజు, ప్రవీణ్, కదిరే మధు, కొమ్ము సామేలు, సుగురు రాము, విక్రమ్, విజయసాగర్, రాయన్న సాగర్, అరవింద్ రెడ్డి, మోహన్సాగర్ గోవిందు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ గెలుపు కోసం భుత్ స్థాయిలో ప్రచారం చేయాలి

## - మద్దూర్ మండల బిజేపీ నాయకులు



**నారాయణపేట జిల్లా ప్రతినిది ప్రజాజ్యోతి మార్చి 30:**పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మద్దతు కోసం భూతు స్థాయిలో ప్రచారం చేయాలి అని నియోజక వర్గ పార్టీ నాయకులు కోరారు.శనివారం మండల విస్తృత స్థాయి సమీక్ష షా గార్డెన్ మద్దూరు పట్టణంలో నిర్వహించడం జరిగింది.సమావేశంలో బూత్ స్థాయి, శక్తి కేంద్రలలో జరిగిన మరియు జరగబోయే పనుల గురించి బూత్ అధ్యక్షులు శక్తి కేంద్రం ఇన్చార్జులు, మండల కమిటీ సభ్యుల తో చర్చించి సూచనలు ఇవ్వడం జరిగింది.అసంపూర్తిగా ఉన్న కమిటీలను సంపూర్ణం చేయమని కోరడమైనది. మరియు జరగబోయే ఉమ్మడి పాలమూరు జిల్లా పార్లమెంట్ ఎలక్షన్లలో బూత్ స్థాయిలో బూత్ కమిటీ మెంబర్లు కార్యకర్తలు నాయకులు కష్టపడి ప్రతి ఓటర్ను కలిసి మన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర పథకాలను, అభివృద్ధి వివరించి తప్పకుండా ఈసారి కేంద్ర ప్రభుత్వం బిజెపి ప్రభుత్వానికి ఎంపీ ఎలక్షన్లో ఓటు వెయ్యాలని శ్రీమతి డీకే అరుణ ను భారీ మెజారిటీతో గెలిపించాలని మనం మండలం నుండి అధిక మెజార్టీవ్వాలని మరియు డీకే అరుణను గెలిపిస్తే మన ఉమ్మడి జిల్లా ఇంకా అభివృద్ధి చెందుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా కూడా 400 సీట్లు గెలుస్తున్నాం కావున మూడవసారి కూడా మన ప్రియతమ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారం చేసి భారతదేశాన్ని విశ్వ గురు స్థానంలో నిలబెట్టుబోతున్నారు.కాబట్టి మనమందరం ఈసారి ప్రజలందరినీ ఏకం ఏకం చేసి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసే విధంగా ప్రోత్సహించాలని బూత్ కమిటీ సభ్యులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ కన్వీనర్ కుంద్రు నర్సింలు, ప్రబారి రాజవర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మదన్, అసెంబ్లీ ఎన్నికల పోటీ చేసిన అభ్యర్థి బంటు రమేష్, కోస్గి మాజీ ఎంపీపీ ఎన్ ప్రతాపరెడ్డి, కో కన్వీనర్ రాము, మండల అధ్యక్షులు శంకర్, సుధాకర్ రెడ్డి, ఎం వెంకటయ్య విజయ భాస్కర్ రెడ్డి, కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శిలు టి సాయిలు బి రవికుమార్ మరియు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదిరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన పలువురు వనపర్తి పుర కౌన్సిలర్స్





**వనపర్తి టౌన్, మార్చి 30 (ప్రజా జ్యోతి):** వనపర్తి పట్టణానికి చెందిన 8 మంది మున్సిపల్ కౌన్సిలర్ లు బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన కౌన్సిలర్ల లో పుట్టపాక మహేష్, భాషా నాయక్, పాకనాటి కృష్ణ, నందిమల్ల భువనేశ్వరి, సత్యమ్మ , చంద్రకళ, నక్క రాములు యాదవ్, జంపన్న యాదవ్ ఉన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ కాలనీ స్థానిక కౌన్సిలర్ పుట్టపాకుల మహేష్ తన నివాసంలో వనపర్తి మున్సిపాలిటీ 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఒంటెద్దు పోకడ వలన వార్డుల్లో ఉన్న సమస్యలు తీర్చలేక పోయామని వారు అన్నారు. డబుల్ బెడ్ రూమ్ పంపకాల విషయాలలో అవకతవకలు జరగాయని తెలిపారు. మాజీ మంత్రి ఓఎస్డి పూర్ణచంద్రారెడ్డి చెప్పిన విధంగానే నడుచుకోవాలని హుకుం జారీ చేయడం తమను భాదించిందని చెప్పారు. మాజీ మంత్రి, మాజీ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్ కౌన్సిలర్లకు ఏమాత్రం గౌరవం ఇవ్వకపోవడం వంటి పలు విషయాల వల్ల మనస్థాపానికి గుర్రై రాజీనామా చేస్తున్నామని భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు.

# పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పకడ్బందీగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్



**వనపర్తి జిల్లా ప్రతినిధి, మార్చి 30(ప్రజా జ్యోతి):**హెూమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పకడ్బందీగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. శనివారం సాయంత్రం హెూమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విధి విధానాల పై రాష్ట్ర ప్రధాన ఎలక్టరోల్ అధికారి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా ఎన్నికల అధికారులకు అవగాహన కల్పించారు.అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్హత ఉన్న ఓటర్లకు హెూమ్ ఓటింగ్ వినియోగించుకునేందుకు ఇప్పటికే ఫారం 12 డి ఇవ్వడం జరిగిందని హెూమ్ ఓటింగ్ ఆవకాశం ఉపయోగించుకునే వారు పూరించిన ఫారం ఎంతమంది ఇచ్చారో నివేదిక ఇవ్వాల్సిందిగా ఆర్డీవో ను ఆదేశించారు.మే, 3 నుండి 8వ తేదీ వరకు హెూమ్ ఓటింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. పోలింగ్ నిర్వహణలో పాల్గొనే సిబ్బంది ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే విధంగా ఫారం 12 ఇచ్చి అన్ని వివరాలు పూరించి సకాలంలో తిరిగి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.వచ్చిన ఫారాలను ఆన్లైన్ లో అప్లోడ్ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారి నుండి పోస్టల్ బ్యాలెట్ పొందేవిధంగా చూడాలని తెలిపారు.ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు సి విజిల్ యాప్ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అదేవిధంగా వచ్చిన ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, ఆర్డీవో పద్మావతి, నోడల్ అధికారులు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలలో విధులు నిర్వహించే ఉద్యోగికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

– ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటుకు కట్టుదిట్టమైన చర్యలు

– పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్







**నారాయణపేట జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి మార్చి 30:** పార్లమెంట్ ఎన్నికలలో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యంపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మయాంకుమిత్తల్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే సదరు ఉద్యోగులందరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందించే దిశగా అవసరమైన మేర అదనపు ఫారం 12 లు సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించే సమయంలో అవసరమైన మేర కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఫారం 12 లు అందజేసి ఉద్యోగి ఆప్షన్ తీసుకోవాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది సమర్పించిన ఆప్షన్ ల ప్రకారం ఏ ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద తమ ఓటు హక్కు వినియోగించుకోవాలో అనే అంశం ఎస్ఎంఎస్ ద్వారా పంపడం జరుగుతుందని, ఓటు హక్కు వినియోగించు కోవడం కోసం ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి జిల్లాలో ఉద్యోగుల నుంచి ఫారం 12 తీసుకొని ఆన్ లైన్ లో నమోదు చేసేందుకు ఒక ప్రత్యేక అధికారిని కేటాయించాలని, ఆన్ లైన్ లో నమోదు చేసిన ఫారం 12 లు సంబంధిత పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్దకు వెళ్తాయని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం హెడ్ క్వార్టర్ లో మే 3న, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో మే 4 నుంచి మే 8 వరకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు స్వీకరించాలని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి ఫారం 12 సమర్పించి ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది తమ ఓటు హక్కు పోస్టల్ బ్యాలెట్ ద్వారా పొందవచ్చని తెలిపారు. భారత ఎన్నికల కమీషన్ అత్యవసర సేవలలో పాల్గొనే సిబ్బందికి సైతం ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించిందని అన్నారు. అత్యవసర సేవలలో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం రిటర్నింగ్ అధికారికి ఏప్రిల్ 23 లోపు ఫారం 12డి సమర్పించాలని, సదరు దరఖాస్తులను పరిశీలించి రిటర్నింగ్ అధికారి ఏప్రిల్ 24 నాడు ఆమోదించిన దరఖాస్తులకు ఎస్ఎంఎస్ ద్వారా ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంపై సమాచారం అందిస్తారని, మే 3 నుంచి మే 8 వరకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద వారి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అన్నారు. 85 సంవత్సరాల పైబడిన సీనియర్ సిటిజెన్లకు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమీషన్ ప్రవేశపెట్టిందని, ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించు కోవాలనుకునేవారు ఏప్రిల్ 23 లోపు ఫారం 12 డి సమర్పించాలని అన్నారు. రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించి ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అర్హులను ఏప్రిల్ 25 నాటికి ఎంపిక చేస్తారని, ఏ.ఆర్.ఓ లు షెడ్యూల్ రూపొందించి బూత్ స్థాయి అధికారుల ద్వారా ఇంటికి వచ్చే షెడ్యూల్ సమాచారం ఓటర్లకు అందించడం జరుగుతుందని అన్నారు. మే 3 నుంచి మే 6 వరకు మొదటి దశ , మే 8న రెండవ దశ ఇంటి వద్ద పోలింగ్ పూర్తి చేయడం జరుగుతుందని, ఇంటి వద్ద పోలింగ్ కు వెళ్లే సమయంలో పోలింగ్ సిబ్బంది వీడియో గ్రాఫర్ తప్పనిసరిగా వెళ్తారని, రాజకీయ పార్టీలకు సైతం సమాచారం అందించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, అశోక్ కుమార్, ఆర్ డి ఓ, ఎస్. యల్. డి. సి. రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్డీఎఫ్ పనులను వారం రోజుల్లో పూర్తిచేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్

**నారాయణపేట జిల్లా ప్రతినిది ప్రజాజ్యోతి మార్చి 30:** నారాయణపేట జిల్లాలో తాగునీటి సరఫరాను మెరుగు పర్చేందుకు ఎస్. డీ.ఎఫ్ కింద మంజూరైన పనులను వారం రోజుల్లోపు పూర్తి చేయాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హల్ లో జిల్లాలోని కోస్గి, మద్దూరు మండలాల ఎంపీడీవో లు, మిషన్ భగీరథ అధికారుల తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మద్దూరు, కొస్గి మండలాల్లోని గ్రామాలలో తాగునీటి సరఫరా ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. కోస్గి మండలం పోలేపల్లి గ్రామంలో నిలిచిపోయిన నీటి సరఫరా ను పునరుద్ధరించాలని సూచించారు. మద్దూరు మండలంలోని మూడు గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ఫిర్యాదులు వచ్చాయని , వెంటనే ఆయా గ్రామాలకు సరఫరా మెరుగుపరచాలన్నారు. రెండు మండలాల పరిధిలో ఎస్. డీ.ఎఫ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి అనిత, మిషన్ భగీరథ అధికారులు వెంకట్ రెడ్డి, ఎంపీడీవో లు పాల్గొన్నారు.



## ట్రైనర్లు అన్ని అంశాలపై పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలి

– జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**వనపర్తి జిల్లా ప్రతినిధి, మార్చి 30(ప్రజా జ్యోతి):** పార్లమెంటు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లు అన్ని అంశాలపై పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని ఎన్ ఐసీ మీటింగ్ హాల్లో ఎన్నికల మాస్టర్ ట్రైనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల సంఘం జారీ చేసిన ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా చదవి, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఆయా అంశాలపై పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా, జాగ్రత్తగా విధులు నిర్వహించేలా సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల మార్గదర్శకాలను సిబ్బందికి శిక్షణలో సవివరంగా తెలియజేయాలని సూచించారు. పోలింగ్ అనంతరం ఫారంలను నింపడంపైనా చక్కటి శిక్షణ ఇవ్వాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో సిబ్బందికి వచ్చే అనుమానాలను సైతం మాస్టర్ ట్రైనర్లు నివృత్తి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం. నగేష్, మాస్టర్ ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు, కోర్టు డ్యూటీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

– జిల్లా అడిషనల్ ఎస్పీ రామదాసు తేజవత్



**వనపర్తి టౌన్, మార్చి 30 (ప్రజా జ్యోతి):** పోలీసులు, కోర్టు డ్యూటీ అధికారులు సమన్వయంతో పని చేసి నేరస్థులకు తప్పక శిక్ష పడేలా చూడాలని నేరస్థులకు శిక్ష ఖరారు శాతం పెరగాలని అడిషనల్ ఎస్పీ రామదాసు తేజవత్ అన్నారు. జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి ఐపిఎస్ ఆదేశానుసారం శనివారం వర్టికల్ ట్రైనింగ్ లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో కోర్టు డ్యూటీ నిర్వహించే కానిస్టేబుళ్లు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్లతో అడిషనల్ ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రామదాసు తేజవత్ మాట్లాడుతూ.. కోర్ట్ వారెంట్స్, సమన్స్, ఎంసీలు, వర్టికల్ గురించి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కోర్టు కానిస్టేబుల్ అధికారులు తమ విధిలో భాగంగా ఎప్పటికప్పుడు ఎన్‌బీడబ్ల్యూలు క్రమం తప్ప కుండా అమలుచేస్తూ నేరస్థులకు శిక్షపడేలా చేయాలని సూచించారు. ఇటీవల నేరస్థులకు కోర్టులలో శిక్షల ఖరారు శాతం పెరిగిందని, ఇందుకు కృషిచేస్తున్న పీపీలు, ఏపీపీలను అడిషనల్ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నిందితులపై స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైనప్పటి నుంచి కేసు పూర్తయ్యే వరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన ఆధారాలు, సాక్షాలు సేకరించి సాక్షుల వాంగ్మూలాలు కోర్టుకు సమర్పించడంలో కోర్టు కానిస్టేబుల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్టికల్స్ ఇంచార్జ్ డీఎస్పీ కృష్ణ కిషోర్, వనపర్తి టౌన్ ఎస్సై జయన్న, మదనాపురం ఎస్సై, కోర్టు మానిటరింగ్ ఏఎస్ఐ భాష, లైజనింగ్ అధికారులు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్ట రక్షణకై పోరాటాలకు సిద్ధం కావాలి

వ్యకాసం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంజయ్య జగన్

ఉపాధి హామీ కూలీలకు రోజు కూలీ రూ. 600 ఇవ్వాలి



**యాచారం, మార్చి 30 (ప్రజాజ్యోతి):** తమ్మలోనిగుడలో శనివారం ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు అంజయ్య, కార్యదర్శి జగన్ సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కూలీలకు క్రమం తప్పకుండా పే స్లిప్పులు ఇవ్వాలన్న నిబంధన ఉన్నా రెండు నెలలుగా కూలీలకు పే స్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. గ్రామంలో ఆరు వారాలుగా పనిచేస్తున్న కూలీలకు నేటికీ డబ్బులు రాలేదని డబ్బులు వెంటనే విడుదల చేయాలని అన్నారు. కనీస వేతన చట్టం ప్రకారం కూలీలకు రోజు కూలి రూ. 600లు ఇవ్వకపోగా 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి రూ. 28 పెంచి ఉపాధి కూలీలకు ఏదో ఒరగపెట్టామని కేంద్ర బిజెపి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని అన్నారు. రెండు పూటలా ఫోటోలు తీయడం ఇతర కొత్త మార్పులతో భవిష్యత్తులో కూలీలకు ఉపాధిని దూరం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని తీసివేయడం ఖాయమని ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని కూలీలకు పిలుపునిచ్చారు.